నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు ఏఈ ఏ.మల్లేష్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. డాన్ బాస్కో ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి 2 గంటల వరకు మైకెల్ కాలనీ, వినాయకనగర్, డీడీ కాలనీ, కాళీమందిర్, ఎస్‌ఎఫ్‌సీ కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడామీ, అభ్యుదయనగర్, అరునోదయనగర్, సంధ్యానగర్, జీఆర్‌నగర్, మాచన్‌పల్లి ఎన్‌క్లేవ్ ప్రాంతల్లో అంతరాయం ఉంటుందన్నారు. బండ్లగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆరెమైసమ్మ మెయిన్ రోడ్డు, కాళీకానగర్, ఎస్‌ఎఫ్‌సీ కాలనీ, మల్లికార్జుననగర్, ఆదర్శనగర్ రోడ్–1, 5, న్యూ కేర్ ఆసుపత్రి, గాయత్రీనగర్, వికాస్‌నగర్, ద్వారకానగర్, యాదవమిత్ర కాలనీ, శిర్డిసాయిబాబా కాలనీ, ప్రశాంత్ కాలనీ, ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీహాల్, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలి


విరాళం అందజేస్తున్న మహేందర్


మైలార్‌దేవ్‌పల్లి: ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలని డాక్టర్ అడికే మహేందర్ కోరారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని లక్ష్మీగూడలోని భ్రమరాంభిక మల్లికార్జునస్వామి ఆలయలో అభయాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణానికి తనవంతు సహాయంగా రూ.100121 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దాతలు బాధ్యతాయుతంగా ముందుకు వచ్చి దేవాలయాల నిర్మాణాలకు తోడ్పాటు అందించాలన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శ్యామ్ మనోహర్, మేడి రమేష్

మైలార్‌దేవ్‌పల్లి: శివరాంపల్లిలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రీజనల్ సెక్రటరీ మంద యాదయ్య, కృష్ణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్యామ్ మనోహర్, ప్రధాన కార్యదర్శి మేడి రమేష్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రయ్య, అడిషనల్ సెక్రటరీ సోమ్లు, కంపెనీ ప్రెసిడెంట్ ఆనంద్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహులు, సెక్రటరీ బీచ్‌పల్లి, రీజినల్ ప్రెసిడెంట్ జైపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రమౌళి, రీజినల్ సెక్రటరీ యాదయ్య, వెంకటేష్, అర్జున్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలి


నరేందర్‌ను సన్మానిస్తున్న జేబా రహమాన్

మణికొండ: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి, మణికొండ మాజీ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికైన జేబా రహమాన్ మంగళవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వం పదేళ్లల్లో ఇవ్వని రేషన్‌కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్సు సర్వీసు లాంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. వాటిని మహిళల్లో ప్రచారం చేసి ప్రతి ఒక్కరూ లబ్ధిపొందేలా చూడాలన్నారు.

108 అంబులెన్స్ సేవల తనిఖీ



శంషాబాద్ రూరల్: జిల్లా 108 సేవల కోఆర్డినేటర్ రాజబాబు మంగళవారం శంషాబాద్‌లోని 108 అంబులెన్స్ సేవలను పరిశీలించారు. అంబులెన్స్‌లోని వైద్య పరికరాలు, అత్యవసరం సమయంలో అందించే మందులను తనిఖీ చేశారు. ఎప్పుడు అప్రమత్తంగా ఉంటూ అత్యవసర కేసుల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.

మదీనాగూడ దీప్తిశ్రీనగర్ వద్ద జీహెచ్ఎంసీ నిర్మించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి



నిర్మించారు సరే.. నిర్వహణేదీ?

చందానగర్: పాదచారులు నిత్యం రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మించారు.జాతీయ రహదారిలో ప్రజల సౌకర్యార్థం కోట్లు వెచ్చించి నిర్మించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల వద్ద నిర్వహణ లోపం కనబడుతుంది. రెండు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలకు ఎస్కలేటర్లు లేవు. కేవలం లిఫ్టులు మాత్రమే ఉన్నాయి. దీంతో పాదచారులు మళ్లీ యథావిధిగా రోడ్డు దాటుతున్నారు. ఎస్కలేటర్లు లేకపోవడం, ఉన్న లిఫ్టులు పనిచేయకపోవడంతో మహిళలు, వృద్ధులు మెట్లు ఎక్కలేక ఎక్కడ పడితే అక్కడ రోడ్డు దాటుతున్నారు. కాగా జీహెచ్ఎంసీ, ప్రైవేట్ సంస్థలు సంయుక్తంగా ఎఫ్ఓబీలు నిర్మించారు. మియాపూర్‌- చందానగర్ వరకు చేపట్టిన ఎఫ్ఓబీలలో మియాపూర్, ఆల్విన్‌కాలనీ చౌరస్తాలో ప్రైవేట్ సంస్థల ద్వారా, మదీనాగూడ దీప్తిశ్రీనగర్ వద్ద, గంగారం జేపీ సినిమాస్ ముందు జీహెచ్ఎంసీ నిధులతో నిర్మించారు. మియాపూర్ నుంచి చందానగర్ జాతీయ రహదారి 200 ఫీట్ల విస్తరణ చేపట్టనున్న నేపథ్యంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల మరమ్మతులు చేపడతారా లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

- ముంబాయి జాతీయ రహదారిపై 5 ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నిర్మించారు

మదీనాగూడ వద్ద ఎస్కలేటర్ పని చేయకపోవడంతో మెట్లు ఎక్కుతున్న మహిళ, పిల్లలు



ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను పట్టించుకోని అధికారులు

పనిచేయని లిఫ్టులు, ఎస్కలేటర్లు.. రోడ్డు దాటుతున్న పాదచారులు

- కాగా ప్రైవేట్ సంస్థలు నిర్మించిన రెండు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలకు ఎస్కలేటర్లు లేవు. లిఫ్టులు ఉన్నా నిర్వహణ లేకపోవడంతో వృథాగా మారాయి.
- జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన ఎఫ్ఓబీలకు మాత్రం ఇరువైపులా ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణ అంతంత మాత్రంగా ఉంది
- లిఫ్టుల ముందు చెత్త చెదారం, మెట్ల వద్ద గుంతలు, బ్రిడ్జి గోడలకు పోస్టర్లు అతికించారు.
- పాదచారుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలకు స్పందన లేదు




గంగారంలోని ఎఫ్ఓబీ ఎస్కలేటర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత

- జన సందోహం, షాపింగ్‌మాల్స్ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని స్థానికులు తెలుపుతున్నారు.
- సూచిక బోర్డులు లేక పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.
- ఎస్కలేటర్లు, లిఫ్టుల వద్ద చెత్త చెదారం, మెట్లు దిగే చోట గుంతలు ఏర్పడ్డాయి.
- ఈ ప్రాంతంలో చిరు వ్యాపారులు డబ్బాలు నిర్వహిస్తున్నారు.

మెట్లు ఎక్కలేకపోతున్నాం



మియాపూర్‌– గంగారం వరకు ఉన్న 4 ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్వహణకు సిబ్బందిని నియమించాలి. లిఫ్టులు, ఎస్కలేటర్లు పని చేయడం లేదు. దీంతో మెట్లు ఎక్కి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నాం.
– జయరాం, మదీనాగూడ

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



బ్రిడ్జిల వద్ద సూచిక బోర్డులు లేవు. ఇష్టానుసారంగా పోస్టర్లు అతికిస్తున్నారు. మెట్ల వద్ద గుంత ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.
– రాజు, దీప్తిశ్రీనగర్

ఆకట్టుకున్న 'నవ వాజ్య రంజని'


కళాకారులకు మంగళశాసనాలు అందజేస్తున్న చిన జీయర్‌స్వామి


వయోలిన్‌ను వాయిస్తున్న చిన్నారులు

శంషాబాద్ రూరల్: శ్రీ భగవద్రామానుజలకు ఇష్టమైన తొమ్మిది అంకెను అనుసరిస్తూ 108 వయోలిన్స్, 18 రకాల సహకార వాయిద్యాలు, 54 మంది వాయిద్యకారులు, 162 కళాకారులతో నిర్వహించిన స్వరార్చన ఆకట్టుకుంది. సమతాకుంభ్ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం సమతా స్ఫూర్తి కేంద్రంలో శ్రీ భగవద్రామానుజ 'నవ వాజ్య రంజని'కార్యక్రమం నిర్వహించారు. కర్ణాటక సంగీతంలో వినియోగించే నగారా, డప్పు, కొమ్ము బూర ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళారత్న డాక్టర్ అశోక్ గురజాలె బృందం వేదోక్త స్వరాలతో చేసిన సంగీత కచేరి వినసొంపుగా సాగింది. కళాకారులను త్రిదండి చిన జీయర్‌స్వామి అభినందించి, మంగళశాసనాలు అందజేశారు.

కనుల పండువగా పెరుమాళ్ల రథోత్సవం



శంషాబాద్ రూరల్: సమతాకుంభ్ తృతీయ బ్రహ్మోత్సవాల్లో మంగళవారం పెరుమాళ్ల రథోత్సవం కనుల పండువగా సాగింది. సమతాస్ఫూర్తి కేంద్రంలో ప్రణవాకార విమాన గోపురం కలిగిన రథంలో సాకేత రామచంద్రస్వామి, 108 దివ్య దేశమూర్తులకు రథోత్సవం నిర్వహించారు. శ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో రథోత్సవం యాగశాలకు చేరుకున్నాక పూర్ణాహుతి చేశారు. అనంతరం పుష్కరిణి వరకు రథయాత్ర సాగింది. అర్చక స్వాములు మంత్రోచ్చారణలతో పెరుమాళ్లకు పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరామచంద్ర జీయర్ స్వామి, శ్రీ అహోబిల జీయర్ స్వామి, శ్రీ దేవనాథ స్వామి, మై హోం గ్రూపు చైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో విదేశీ కరెన్సీ పట్టివేత

శంషాబాద్ రూరల్: శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం భారీగా విదేశీ కరెన్సీ పట్టుబడింది. వివరాలు ఇలా ఉన్నాయి... ఉదయం హైదరాబాద్ నుంచి దుబాయ్ వెళ్తున్న అమీర్ అహ్మద్ అనే ప్రయాణికుడి కదలికలపై సీఐఎస్‌ఎఫ్ అధికారులకు అనుమానం కలిగింది. దీంతో అతడిని క్షుణ్ణంగా తనిఖీ చేయగా రూ.22 లక్షల విలువైన విదేశీ కరెన్సీ దొరికింది.


ప్రయాణికుడి వద్ద లభించిన విదేశీ కరెన్సీ

అధికారులు అతడిని అదుపులోకి తీసుకుని కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయిబాబా ఆలయం, డీఎంఆర్‌ఎల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం ట్రాఫిక్‌–3 డీసీపీ ఆర్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్టీ టోన్ హారన్లు, సైరన్లు, బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించి నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేశారు. సైరన్లు, బ్లాక్ ఫిల్మ్ వాడొద్దని డీసీపీ ప్రజలకు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ డ్రైవ్‌లో డెల్టా 30 అధికారి ఇ.నరసింహా నాయక్, ఎస్సైలు వి.సత్యనారాయణ, వెంకటప్ప, సంతోష్‌నగర్ ట్రాఫిక్ పీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మజ్లిస్ శాసన సభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. మంగళవా రం ఆయన ఆసిఫ్‌నగర్ మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఆయన వెంట కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మణికొండ: 50 ఏళ్ల క్రితం నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న వారంతా మంగళవారం నార్సింగిలో సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి మిత్రులంతా కలిసి సందడి చేశారు. అప్పటి రోజులను తల్చుకుని సంబరపడ్డారు. రాబోయే రోజుల్లో మరింత మంది మిత్రులను పిలిచి ఘనంగా సమ్మేళనం నిర్వహించుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సూర్యప్రకాశ్, బీఆర్ఎస్ నాయకుడు నర్సింహాలతో పాటు వారి మిత్రులు పాల్గొన్నారు.

'జూ'ను సందర్శించిన సింగపూర్ అధికారుల బృందం

బహదూర్‌పురా: ఆసియా సింహాలు, బెంగాల్ పులులు, ఒక కొమ్ముగల ఖడ్గమృగం, మౌస్ డీర్ల సంతాన ఉత్పత్తిలో విజయం సాధించి కొన్నిటిని అడవిలో విజయవంతంగా విడుదల చేయడంలో జూ పార్క్ ప్రత్యేక చొరవ తీసుకొని విజయం సాధించిందని సింగపూర్ జంతు ప్రదర్శన శాలల ప్రత్యేక ప్రాజెక్టుల వైస్ ప్రెసిడెంట్ కుమార్ పిళ్లై అన్నారు. మంగళవారం నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌ను ఆయన అధికారుల బృందంతో సందర్శించారు. తెలంగాణ జూ పార్కుల డైరెక్టర్ సునీల్ ఎస్. హిరేమత్, జూ పార్క్ క్యూరేటర్ వసంత కలిసి జూను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూను సందర్శించడం ఇది మూడోసారి అని ప్రతిసారి ఎంతో పరిణతి సాధించిన అమోఘమైన విజయాలతో చరిత్ర సృష్టించింది అన్నారు. ఈ కార్యక్రమంలో జూ పార్క్ డిప్యూటీ క్యూరేటర్ ఎం.బర్నోబా, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ హకీమ్, అసిస్టెంట్ క్యూరేటరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

మణికొండ: బస్టాప్‌లో నిలుచుని ఉన్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు వేగంగా ఢీ కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నార్సింగిలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..మంచిరేవులకు చెందిన పొన్నబోయిన లక్ష్మణ్(50) మంగళవారం మధ్యాహ్నం నార్సింగి బస్టాప్ వద్ద నిల్చుని ఉన్నాడు. మెహిదీపట్నం నుంచి శంకర్‌పల్లికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతన్ని ఢీ కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

రాజేంద్రనగర్: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రవి కుమార్ సూచించారు. ఈ మేరకు మంగళవారం సర్కిల్ కార్యాలయంలో ఆయన ఏఎంహెచ్ఓ, ఎస్ఎస్, ఎస్‌ఎఫ్ఏలు, రామ్‌కీ టీమ్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బస్తీలు, కాలనీల్లో సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తా చెదారాలను తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

ఇంటి వద్దకే కేన్సర్ వైద్య సేవలు

గచ్చిబౌలి: దేశంలోనే మొదటిసారిగా 'ఇంటి వద్దకే కేన్సర్ చికిత్స సేవలను' పీఐ కేన్సర్ కేర్ అందుబాటులోకి తీసుకొచ్చిందని పీఐ కేన్సర్ కేర్ వ్యవస్థాపకులు, డైరెక్టర్, చీఫ్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ భరత్ పటోడియా పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని పీఐ కేన్సర్ కేర్‌లో ఇంటి వద్దకే కేన్సర్ చికిత్సను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని కేన్సర్ రోగులకు 24/7 వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. రోగులకు కీమోథెరపీ, బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్, కేన్సర్ టీకాలను ఇంటి వద్దకు అందిస్తామన్నారు. ఆస్పత్రులలో చికిత్స పొందడం రోగులకు ఒత్తిడిగా ఉంటుందని, కుటుంబ సభ్యుల మధ్య వైద్యం పొందవచ్చన్నారు. కేన్సర్ పోరాటంలో మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమని, ఇంట్లో చికిత్స తీసుకుంటే అది సాధ్యమవుతుందన్నారు. నర్సింగ్ బృందం కీమోథెరపీ చికిత్స చేస్తూ రోగులను నిరంతరం పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ప్రత్యేకమైన డిజిటల్ పరికరంతో ఐదు హెల్త్ పారామీటర్స్‌ను డాక్టర్‌కు రిపోర్ట్ చేస్తారన్నారు.

ఎన్ఐఆర్‌డీపీఆర్ ఉద్యోగుల నిరసన


ఎన్ఐఆర్‌డీపీఆర్ సంస్థ ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఏజీవర్సిటీ: కేంద్ర బడ్జెట్‌లో సంస్థకు నిధులు నిలిపివేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్) ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం నిరసన తెలిపారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద ప్లకార్డులు, బ్యానర్లతో సంస్థ భవిష్యత్, 223 మంది ఉద్యోగులను, 300 మందికి పైగా పెన్షనర్లను రక్షించడానికి ఆర్థిక సహాయాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఒకప్పుడు గ్రామీణ విధానానికి అధిపతిగా పరిగణించబడే ఇన్‌స్టిట్యూట్ కార్యాచరణ ఉనికితో విడిపోవడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నప్పటికి వారి పెన్షన్లు రక్షించబడుతున్నందున ప్రస్తుతం సేవలందిస్తున్న ఉద్యోగులకు సంఘీభావం చూపించడానికి పెన్షనర్లు చేసిన ఒక కాల్పనిక నిరసనగా ఇది నిలిచిందన్నారు. 65 సంవత్సరాలుగా ఎన్ఐఆర్‌డీపీఆర్ గ్రామీణాభివృద్ధిలో మార్గదర్శక శక్తిగా ఉందని పంచాయతీ రాజ్ సంస్థలు(పీఆర్ఐలు) ప్రభుత్వ అధికారులు, ఎన్జీవోలు, గ్రామీణాభివృద్ధి నిపుణులకు క్లిష్టమైన శిక్షణ, విధాన మద్దతును అందిస్తుందన్నారు. సంస్థకు సున్నా బడ్జెట్ కేటాయింపు దాని భవిష్యత్‌ను అనిశ్చితిలోకి నెట్టివేసిందన్నారు. ఈ నిరసనలో జ్యోతిస్ సత్యపాలన్, ధీరజనా, రాజాకుమార్ సిన్హా, సి.కీర్తిరెసన్, శ్రీనివాససజ్జా పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లు ఇవ్వండి

మణికొండ: గృహాలు నిర్మించుకున్నా అధికారులు విద్యుత్ మీటర్లు ఇవ్వకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇకనైనా అధికారులు వాటిని మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ కార్యదర్శి ఎం.ప్రదీప్ కుమార్ కోరారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ మీటర్లను ఇవ్వటం లేదన్నారు. జీవో 111 పరిధిలో ఉన్న గ్రామమని విద్యుత్ మీటర్లను ఇవ్వకపోవటం భావ్యం కాదన్నారు. ప్రజలు నిర్మించుకున్న గృహాలకు మున్సిపాలిటీ పన్నులు తీసుకుంటున్నపుడు విద్యుత్ మీటర్లు ఎందుకు ఇవ్వరని ఆయన ప్రశ్నించారు. అదే విషయాన్ని మంగళవారం విద్యుత్ శాఖ ఏడీఈ అంబేడ్కర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, రాము, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సర్వేపై అవగాహన

మాదాపూర్: మాదాపూర్ వార్డు కార్యాలయంలో మంగళవారం కులగణన సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఆధ్వర్యంలో సభ్యుడు తిరుమలగిరి సురేందర్, బీసీ సంక్షేమం రంగారెడ్డి జిల్లా ఉపసంచాలకులు బి.కేశవరామ్, మాదాపూర్ కాలనీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డిలు పాల్గొన్నారు. ఇటీవల జీహెచ్ఎంసీ నిర్వహించిన కుల గణనలో తమ సమాచారం ఇవ్వని వారికి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. సర్వేలో వివరాలు ఇవ్వని వారికి మరో అవకాశాన్ని కల్పించనున్నట్టు తెలిపారు.



కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గుడిమల్కాపూర్ లక్ష్మీనగర్‌కు చెందిన కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం ఆయనను మెరాజ్ కాలనీలో కలిశారు. ఈ సందర్భంగా లక్ష్మీనగర్‌లో అభివృద్ధి పనులు చేయించిన సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ సెక్యూలర్ పార్టీ అని ఎవరిపై ఎటువంటి వివక్ష లేకుండా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయడం పార్టీ ఏకైక లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, లక్ష్మీనగర్ కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

చాంద్రాయణగుట్ట: ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి బోయ నగేశ్ అన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని అత్యంత పురాతనమైన స్వయంభూ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ మెట్ల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.7 లక్షల నిధులు మంజూరు చేయడంతో మంగళవారం ఆలయ చైర్మన్ మహేశ్‌గౌడ్‌తో పనులను ప్రారంభించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీధర్, శైలేష్, రాజు ముదిరాజ్, అశోక్, వర్షిత్ పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ మహేశ్ గౌడ్ తదితరులు